# ఇందలినీతి : చెడలేదు

సుబ్బారావున్నరగంటలు కావొస్తున్నది. సీత ఎదురు చూస్తున్నది. చిమ్మచీకట్లు కమ్ముకొంటున్నాయి. సీత పెరట్లో నూతిదగ్గర కాచుకొని కూర్చుంది. అంకోళన మనస్సులో అలముకుంటున్నది. సీత సీతని ప్రశ్నిస్తున్నది. సుబ్బారావున్నర గంటలు సీత గుండెల్లో కొట్టేరు. సీత ఎదురుచూస్తున్నది.

సుబ్బారావు వచ్చేడు. ఆందోళన మనస్సులో అలముకొంటున్నది. సుబ్బారావు సీతపక్కన కూర్చున్నాడు. సీత ఎదురుచూస్తున్నది; సుబ్బారావు మాట్లాడేడు. చీమ్మ చీకట్లు తొలగుతున్నాయి. సుబ్బారావున్నర గంటలు సీత గుండెల్లో పూర్తయేయి.

సుబ్బారావు సీతని ప్రశ్నించేడు. ఆందోళనా, చిమ్మ చీకట్లు అలముకొంటున్నాయి. సీత గుండెల్లో వాచీ ఆగిపోయింది. సీత కాచుకొని ఎదురుచూస్తున్నది. సుబ్బారావు 'కీ' ఇచ్చాడు.

సీత సీతని ప్రశ్నించింది. సుబ్బారావు యిచ్చిన సలహాని కూడబలుక్కొని సీత పాలిపోయింది. పాలిపోయిన ఆ గొంతుకలో స్వరపేటిక అర్చుకుపోయింది. సీత గొంతుక సీసాకి సీలువేసిన బిరడా ఊడి రాలేదు.

సుబ్బారావు ఇచ్చిన సలహాని సీత మనస్సు కూడ బలుక్కొంది సీత మనస్సు తేలికైంది. తేలికైన ఆ మన

స్సులో పరిమళాలు పచార్లు చేస్తున్నాయి. సీత మనస్సు సంకెళ్లు ఊడిపోయాయి.

సుబ్బారావు ఇచ్చిన సలహాని సీత మనస్సులో సీత నివసిస్తున్న సంఘం కూడబలుక్కొంది. సీత సంఘం వెర్రెత్తిపోయింది. వెర్రెత్తిన ఆ సీత సంఘం సకిలించింది. దాని నోటికి తాళంలేదు.

సుబ్బారావు ఇచ్చిన సలహాని సీత భవితవ్యం కూడ బలుక్కొంది. సీత భవితవ్యం చీకట్లో చిక్కుకుంది చీకట్లో చిక్కుకున్న ఆ భావినిండా ప్రశ్నార్థకపు గుర్తులు. వాటిని పరిష్కరించిందికి మార్గాల—

సుబ్బారావు అన్నాడు. 'సీతా! నువ్వేం ఇదవకు. నిన్ను ఈ నరకంలోంచి లేవదీసుకుపోయే ధైర్యం నాకుంది. ఈ గొడవని కోర్టుదాకా ఈడ్చేదమ్ములు నీ మొగుడికి లేవని నేను దస్తావేజు రాసి ఇస్తాను, బాగా ఆలోచించుకో,

సీత ఆలోచించుకొంది. సీతా, సీతమనస్సు, సీత మనస్సులో నివసిస్తున్న సంఘం, సీత భవితవ్యం బాగా ఆలోచించుకొన్నాయి. సీత పాలిపోయింది. సీత గుండెల్లో వాచీ అలారం కందిరీగలా రొదచేస్తున్నది.

సుబ్బారావు భవితవ్యం, సుబ్బారావు ఆర్థిక సమస్యలు చిమ్మచీకట్లలా సీత మనస్సులో కమ్ముకున్నాయి. తమ ఉమ్మడి జీవితంచుట్టూ ఉండబోయే సంఘం చేయబోయే అందోళన సీత గుండెల్లో అలముకొంటున్నాది. సీత ఆలోచనలు మండుతున్నాయి.

సుబ్బారావు మళ్ళీ అన్నాడు. 'సీతా! నువ్వేం ఇదవకు. నిన్ను పువ్వుల్లో పెట్టుకొంటా. మన కేం లోపం రాదనే ధైర్యం నాకుంది. డబ్బుగురించీ, నా చిక్కుల గురించీ నువ్వేం బెంగ పెట్టుకోకు. మదరాసులో మనం బతక లేకపోం, బాగా ఆలోచించుకో'

సీత బాగా ఆలోచించుకొంది. సీత మనస్సు కిందా మీదా పడ్డాది; సీత సమస్యల పద్మవ్యూహంలో చిక్కడ్డాది. సీత ఉక్కిరిబిక్కిరి అయింది. సీతకి సుబ్బారావు చేయూతకాక, మరొకరి సలహా అవసరమైంది

సుబ్బారావున్నర గంటలు కొట్టక ముందూ సీత సుబ్బారావే అన్నీ రక్షించగల, తనకి సలహా నివ్వగలవాడని నిర్థారణ చేసుకొంది, తీరా సుబ్బారావు ఇచ్చిన సలహాని చదువుకొన్న తరువాత సీత బెంబేరెత్తిపోయింది.

మరో గత్యంతరం లేదనుకొంది. ఈ సమస్యకి మరో విధంగా పరిష్కారం జరగదని సీత అనుకొంది. గాని సుబ్బారావు ఈ సలహాని అందివ్వగానే సీత గుండెల్లో ఎవరో నిప్పులు చెరుగుతున్నట్టనిపించింది.

సీత చదువుకొన్నదే. సీత పిరికిది కాదు. కాని సీతకి ముందూ వెనకా ఉన్నారు, అందుకే సీత వెనకాడుతూ ఉంది. అందుకే సుబ్బారావు సలహాని గల్లైవేసుకొని సీత పాలిపోయింది.

సుబ్బారావు కెచ్చుకొట్టేడు; 'సీతా! రేపీపాటికి మళ్ళీ ఆ నరకంలో–ఆ పాముపడగ కింద–ఆ గంధకజ్వాలల్లో–రేపీపాటికి; బాగా ఆలోచించుకో, రేపొద్దున్న, నీ మొగుడు యమధర్మరాజులా వస్తాడు రేపొద్దున. బాగా ఆలోచించుకో! రేపీపాటికి బాగా ఆలోచించుకో!'

చివరికి సీత 'అయితే' అని ఊరుకొంది. సీతగొంతుక లోని స్వరపేటిక సవరించుకొన్నా, ఆ ఒక్క–మాట తప్పించి మరేం పలకబడలేదు. సుబ్బారావు ఆ మాటనే పొడిగించి నివురు ఊదేడు.

సీతకి జువ్విచెట్టుమీద దెయ్యాన్ని చూసినంత భయం పట్టుకొంది. సుబ్బారావు మరి నాల్గు నిమిషా లక్కడుంటే తను ముందూ వెనకా చూసుకోకుండా తన ముందూ వెనక ఉన్నవాళ్ళని నూతిలోనూ గోతిలోనూ దింపేయవచ్చని భయపడింది.

భయంతో సీత గొంతుకలోని తీగెలు ఒక్క–సారి 'లాభంలేదు' అని పలికేయి. గంటసేపు అదేపల్లవి సుబ్బారావు గుండెల్లో. వాచీ ఆగిపోయింది, సుబ్బారావులోచిమ్మ చీకట్లు కమ్ముకొన్నాయి. సుబ్బారావు ఆందోళనలో ఊదలేక పోతున్నాడు.

ఇంక సుబ్బారావు జీవితంలో సీతం పావుగంట లుండవు. సుబ్బారావు 'బాగా ఆలోచించుకో' అన్నాడు. సుబ్బారావు వెళ్ళిపోయాడు.

సుబ్బారావున్నర గంటలు అయిపోయేయి. సీత ఎదురు చూస్తున్నది. చిమ్మ చీకట్లు కమ్ముకొన్నాయి. సీత పెరట్లో నూతిలోకి చూస్తున్నది. సీత సీతకి జవాబు చెప్పుకొంది. సీతకి ముందూ వెనకా ఉన్నారు. సీత పిరికిది. సీతకి చదువు లేదు. ఆ సీత నరకంలోకి–పాము పడగకిందకి– గంధక జ్వాలల్లోకి—